సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం ◆ 4 ◆ జూలై ◆ 2023



పరిష్కార చర్యలు వివరించాలి


వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులకు సంతృప్తికర పరిష్కారం చూపాలని కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశించారు. -IIలో

ఏసీబీ వలలో సర్వేయర్



కాసులకు కక్కుర్తిపడిన ఓ మండల సర్వేయర్ రూ.పది వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు సోమవారం పట్టుబడ్డాడు. -IIలో

శాకంబరిగా వారాహి అమ్మవారు



బొబ్బిలి: కృష్ణాపురంలోని వారాహి అమ్మవారు సోమవారం శాకంబరీ దేవి అలంకరణలో దర్శనమిచ్చారు. కూరగాయలు, ఆకు కూరలతో అలంకరించిన అమ్మవారిని భక్తులు దర్శించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

న్యూస్‌రీల్

శాకంబరిగా పైడితల్లి



విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారు సోమవారం గురు పౌర్ణిమ పర్వదినాన శాకంబరి దేవీగా వనంగుడిలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ అర్చకులు మూలాపాపారావు, నేతేటి ప్రశాంత్‌లు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారిని కూరగాయలతో సర్వాంగ సుందరంగా శాకంబరిమాతగా అలంకరించారు. మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈఓ కె.ఎల్.సుధారాణి పర్యవేక్షించారు.

ఉపాధ్యాయులకు శిక్షణ

విజయనగరం పూల్‌బాగ్: ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్‌పై పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాలు, విజయనగరం జిల్లాలోని 27 మండలాల్లోని 10,637 మంది ఉపాధ్యాయులకు రెండు రోజుల పాటు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు డీఈఓ బి.లింగేశ్వరరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 1 నుంచి 16వ తేదీ వరకు ఏడు ఇంజినీరింగ్ కాలేజీల్లో (తగరపువలస, గరివిడిలోని అవంతి, రాజాంలోని జీఎంఆర్, విజయనగరంలోని జేఎన్‌టీయూకే, జొన్నాడ వద్ద ఉన్న లెండి, చింతలవలసలోని ఎంవీజీఆర్, గాజులరేగ వద్ద ఉన్న సీతం) 15 విడతల్లో 279 బ్యాచ్‌లుగా శిక్షణ సాగుతుందన్నారు. ఒక్కో బ్యాచ్‌లో గరిష్ఠంగా 40 మందికి శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ ఉపయోగించే విధానం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్ ఉపయోగించి బోధన చేసే విధానం, బైజూస్ టాబ్స్‌లో కంటెంట్ ఉపయోగించి ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానెల్స్‌లో బోధించే విధానంపై శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు.


సీమలవానివలసలో ఏనుగుల గుంపు



సీమలవానివలసలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి: శివ్వాం పంచాయతీ సీమలవానివలసలో ఏనుగుల గుంపు సోమవారం దర్శనమిచ్చాయి. నాలుగున్నరేళ్లుగా కురుపాం నియోజకవర్గంలోని గరుగుబిల్లి, కొమరాడ, జియ్యమ్మవలస, కురుపాం మండలాల్లో ఏనుగులు సంచరిస్తున్నాయి. గిజబ, తోటపల్లి గ్రామాల మీదుగా సంతోషపురం, సీమలవానివలస చేరుకొన్నాయి. పంటలను నాశనం చేస్తుండడంతో రైతులు ఆవేదన చెందుతున్నారు. అటవీ శాఖాధికారులు స్పందించి ఏనుగుల గుంపును అటవీప్రాంతంలోకి మళ్లించాలని కోరుతున్నారు.

కుండపోత



జలమయమైన ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానం

గజపతినగరం: జిల్లాలో విజయనగరం, గజపతినగరం, రామభద్రపురం తదితర ప్రాంతాల్లో సోమవారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. పంటలకు ఊపిరిపోయడంతో రైతులు సంతోష పడుతున్నారు. వరి వెదలు చక్కగా మొలకెత్తుతాయని చెబుతున్నారు.

కౌన్సెలింగ్ నేడు

విజయనగరం పూల్‌బాగ్: ఉమ్మడి విజయనగరం జిల్లా పరిధిలో ఖాళీగా ఉన్న 28 జిల్లా పరిషత్ యాజమాన్యంలోని గ్రేడ్–2 ప్రధానోపాధ్యాయుల పోస్టులకు మంగళవారం ఉదయం 9.30 గంటలకు డీఈఓ కార్యాలయంలో ఉద్యోగోన్నతి కౌన్సెలింగ్ నిర్వహిస్తామని డీఈఓ బి. లింగేశ్వరరెడ్డి సోమ వారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున https://riter. goole. com/site/doevizianagaram వెబ్ సైట్‌లో పొందుపర్చిన సీనియారిటీ తుది జాబితా ప్రకారం ఉపాధ్యాయులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్, సర్వీస్ రిజిస్టర్‌తో హాజరుకావాలని కోరారు.

అవిశ్రాంత కానుక

- ఆర్టీసీ ఉద్యోగులకు అధిక పింఛన్ స్కీం
- రాష్ట్రప్రభుత్వం సరికొత్త ఒరవడికి శ్రీకారం
- నెరవేరనున్న ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం
- మూడో విడతగా ఈ నెల 11 వరకు నమోదు చేసుకునే అవకాశం
- మన్యం జిల్లాలో 1081 మంది ఉద్యోగులకు ప్రయోజనం
- ఇదో అద్భుత అవకాశంగా పేర్కొంటున్న ఉద్యోగులు



పార్వతీపురం ఆర్టీసీ బస్‌స్టాండ్

పార్వతీపురం టౌన్:

అన్నివర్గాల ప్రజలకు జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ఏదో ఒక రూపంలో లబ్ధిచేకూర్చుతోంది. నాలుగేళ్లుగా సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తోంది. ప్రజల జీవన ఉన్నతికి పాటుపడుతోంది. అందులో భాగంగానే దేశంలో ఎక్కడాలేని విధంగా ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి వారి జీవితాల్లో వెలుగులు నింపింది. ఇప్పుడు మరో అడుగు ముందుకు వేసి ఉద్యోగ విరమణ పొందిన వారి సంక్షేమానికి మరో సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకూ ఈ సంస్థలో పని చేసిన ఉద్యోగులకు పదవీ విరమణ అనంతరం అరకొరగా పెన్షన్ అందేది. ఆ విధానానికి చరమగీతం పాడి అధిక పెన్షన్ స్కీమ్ (హయ్యర్ పెన్షన్)కు ప్రభుత్వం నూతన ప్రణాళిక సిద్ధం చేసింది. ఆర్టీసీ ఉద్యోగి పదవీ విరమణ అనంతరం అధిక మొత్తంలో పెన్షన్‌ను జీవితాంతం అందుకునేందుకు అవకాశం కలుగుతుంది. గతంలో ఉద్యోగ విరమణ అనంతరం కనీసం రూ. మూడు వేల పెన్షన్ మాత్రమే పొందేవారు. ఈ హయ్యర్ పెన్షన్ స్కీమ్ ద్వారా ఇప్పటి వరకూ అందే పెన్షన్ కన్నా 5 నుంచి 6 రెట్లు వరకూ పెరిగే అవకాశం ఉంది.

జీవితానికి భరోసా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల చిరకాల స్వప్నం నెరవేరనుంది. ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్‌లో ఉద్యోగుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదుకు అవకాశం కల్పించింది. 2014 సెప్టెంబర్ 1 నాటికి ఆర్టీసీ ఉద్యోగిగా విధుల్లో చేరిన డ్రైవర్లు, కండక్టర్లు, గ్యారేజ్ మెకానిక్‌లు, సెక్యూరిటీ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది అర్హులు. పథకంలో నమోదుకు మొదటి విడత ఏప్రిల్ 3 నుంచి మే 3 వరకూ, రెండో విడత మే 4వ తేదీ నుంచి జూన్ 26 వరకూ అవకాశం కల్పించింది. కొద్దిమంది ఉద్యోగులు సాంకేతిక లోపం కారణంగా సరైన వివరాలు నమోదు చేయకపోవడం, మరికొంత మంది దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో మరో అవకాశం ఇచ్చింది. మూడో విడతగా జూన్ 27 నుంచి జూలై 11వ తేదీ గడువు ఇస్తూ నమోదు చేసుకోవాలని అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఉద్యోగులు పూర్తి స్థాయిలో నమోదు చేసుకున్నాక వారి బేసిక్ స్కేల్‌ను అనుసరించి ఎంప్లాయీస్ పెన్షన్ ఫండ్ ఆర్గనైజేషన్ లెక్కలు కట్టి ఉద్యోగులకు చెల్లించే మొత్తాన్ని ప్రకటించనుంది.

జిల్లాలో ప్రయోజనం చేకూరనున్న ఆర్టీసీ ఉద్యోగుల సంఖ్య ఇలా...	
ఆర్టీసీ డిపో	ఉద్యోగులు
పాలకొండ	403
పార్వతీపురం	369
సాలూరు	294
ఆఫీస్ సిబ్బంది	15
మొత్తం	1081

అవగాహన కల్పించాం



ఆర్టీసీ ఉద్యోగులకు ఇదో అద్భుత పథకం. పార్వతీపురం మన్యం జిల్లాలోని మూడు డిపోల పరిధిలో 1081 మంది ఉద్యోగులు హయ్యర్ పెన్షన్ పథకంలో నమోదుకు అవగాహన కల్పించాం. దీనిని వారు సద్వినియోగం చేసుకునేలా చర్యలు చేపట్టాం. ఉద్యోగుల దరఖాస్తులను నమోదు చేస్తున్నాం. రెండు రోజుల్లో నమోదు ప్రక్రియ పూర్తి చేయిస్తాం. ఆర్టీసీ ఉద్యోగులకు ఎంతగానో ఉపయోగపడుతుంది.

– టీవీఎస్ సుధాకర్, జిల్లా ప్రజారవాణా అధికారి, పార్వతీపురం మన్యం

ఆర్టీసీ ఉద్యోగులకు మేలు చేసిన ప్రభుత్వం



ఆర్టీసీ ఉద్యోగులకు ప్రభుత్వం ఎంతో మేలు చేసింది. ఉద్యోగ విరమణ పొందిన తర్వాత అరకొర పింఛన్ వస్తుందని ఆందోళన చెందాం. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి అధిక పెన్షన్ పథకం తీసుకు రావడం సంతోషంగా ఉంది. నమోదు అనంతరం ప్రావిడెంట్ ఫండ్ సంస్థకు చెల్లించాల్సిన మొత్తం ఒకేసారి కాకుండా వాయిదాల పద్ధతిలో కట్టుకునే అవకాశం కల్పిస్తే వెసులబాటుగా ఉంటుంది.

– పి.వి.రమణ, వైఎస్సార్ ఆర్టీసీ, ఎంప్లాయిస్ అసోసియేషన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు

జగనన్న దేశానికే ఆదర్శం



విద్యార్థులు, వారి తల్లులకు 'అమ్మఒడి' నమూనా చెక్కును అందజేస్తున్న డిప్యూటీ సీఎం రాజన్నదొర

- నాలుగేళ్లలో 'అమ్మఒడి' కింద రూ.27వేల కోట్ల లబ్ధి
- డిప్యూటీ సీఎం రాజన్నదొర

మెంటాడ:

సంక్షేమ, అభివృద్ధి పాలన సాగిస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి దేశానికే ఆదర్శంగా నిలిచారని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మన రాష్ట్రంలో అమలుచేస్తున్న సంక్షేమ పథకాలపై పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు అధికారులతో అధ్యయనం చేయిస్తున్నారని, వారి రాష్ట్రాల్లో అమలుచేసేందుకు కసరత్తు చేస్తున్నారన్నారు. మెంటాడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో సోమవారం నిర్వహించిన 'జగనన్నఅమ్మఒడి' నిధుల విడుదల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా 88లక్షల మంది విద్యార్థులు ఉండగా అందులో 43 లక్షల మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లోకి ఈ ఏడాది సుమారు రూ.7వేల కోట్లను అమ్మఒడి పథకం కింద జమచేసినట్టు వెల్లడించారు. నాలుగేళ్లలో రూ.27వేల కోట్ల మేర లబ్ధి చేకూర్చారన్నారు. ప్రపంచవ్యాప్తంగా 200 కళాశాలల్లో సీట్లు సంపాదించిన విద్యార్థుల చదువుకు ఒక్కో విద్యార్థికి రూ. కోటి 50లక్షల ఆర్థిక భరోసా కల్పిస్తున్నారని చెప్పారు. ఇంటర్మీడియట్, డిగ్రీ విద్యార్థులకు పూర్తిగా ఫీజు రీయింబర్స్‌మెంట్ సదుపాయం కల్పిస్తున్నారన్నారు. గత టీడీపీ ప్రభుత్వం 800 మంది విద్యార్థుల విదేశీ చదువుల పేరుతో రూ.635 కోట్లను మాయం చేసిందన్నారు. పాఠశాల ప్రారంభం రోజునే పుస్తకాలు, యూనిఫారాలు, బూట్లు, బెల్టు, డిక్షనరీ, నోట్‌బుక్స్, బ్యాగుతో కూడిన జగనన్న విద్యాకానుక కిట్లను అందజేసిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. పేదకుటుంబాల పిల్లల ఉజ్వల భవిష్యత్తుకు గట్టిపునాది వేస్తున్నారన్నారు. అనంతరం అమ్మ ఒడి నమూనా చెక్కును విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు అందజేశారు.

ప్రజలందరికీ మేలు చేకూర్చాలనే..

రాష్ట్రంలో అర్హత ఉన్న ఏ ఒక్కరూ పథకాలకు దూరం కాకూడదన్నదే జగనన్న సురక్ష కార్యక్రమ ప్రధాన ఉద్దేశమన్నారు. దీనిని శతశాతం విజయవంతం చేయాల్సిన బాధ్యత మనందరిపైనా ఉందని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మెంటాడ ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో సోమవారం నిర్వహించిన జగనన్న సురక్ష అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా, అవినీతి రహితంగా, పారదర్శకంగా పథకాలను మంజూరుచేస్తున్న దమ్మున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిగా పేర్కొన్నారు. ఈనెల 1వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా 3లక్షల61వేల ధ్రువపత్రాలు మంజూరు చేసినట్టు వెల్లడించారు. మండలంలోని కుంటినవలసలో రూ.400 కోట్ల వ్యయంతో మంజూరైన గిరిజన వర్సిటీని ప్రారంభించేందుకు సీఎం త్వరలో వస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రెడ్డి సన్యాసినాయుడు, జేసీఎస్ కన్వీనర్ కనిమెరక త్రినాథరావు, వైస్ ఎంపీపీలు సారిక ఈశ్వరరావు, పొట్టంగి దుర్గ, సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎంపీటీసీ సభ్యుడు పతివాడ కుమారి, పార్టీ నాయకులు లెంక రత్నాకర్‌నాయుడు, రెడ్డి రాజప్పలనాయుడు, మయూర్ అప్పలనాయుడు, రాయిపిల్లి రామారావు, ఎంపీడీఓ త్రివిక్రమ్, తహసీల్దార్ రామకృష్ణ, ఎంఈఓ వెంకటరావు పాల్గొన్నారు.

మాతాశిశు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ



పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలో ప్రసూతి వార్డు

- గర్భిణులు, బాలింతలకు ఇంటికే పౌష్టికాహార సరుకులు
- ప్రతినెలా వైద్య తనిఖీలు
- ఊరిలోనే ఫ్యామిలీ డాక్టర్‌తో వైద్యం
- ఉచితంగా మందులు అందజేత
- గతంలో కేవలం రూ.250 విలువ చేసే బేబీకిట్టు
- ఇప్పుడు బాలింత ఖాతాల్లో రూ.5వేలు జమ
- తల్లీపిల్లలను సురక్షితంగా ఇంటికి చేర్చుతున్న తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్

పార్వతీపురంటౌన్:

రాష్ట్ర ప్రభుత్వం మాతాశిశు సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. గర్భిణి నుంచి సుఖప్రసవమయ్యేవరకు వైద్య, ఆరోగ్య సేవలందిస్తోంది. జిల్లాలోని అన్ని పీహెచ్‌సీల్లోనూ నెలనెలా వైద్యపరీక్షలు చేయిస్తోంది. గర్భిణులు ఆరోగ్యంగా ఉండేందుకు పౌష్టికాహారంతో పాటు మందులు అందజేస్తోంది. అవసరమైన వారికి ఫ్యామిలీడాక్టర్ విధానంలో వైద్యులు ఇంటికి వెళ్లి పరీక్షలు చేస్తున్నారు. అన్ని ప్రభుత్వ ఆస్పత్రులకు 'నాడు–నేడు' నిధులతో ఆధునిక సొబగులు అద్దడం, పూర్తిస్థాయిలో వైద్యులు, సిబ్బందిని నియమించడం, ఆధునిక వైద్య పరికరాలను సమకూర్చడంతో మెరుగైన వైద్యసేవలు అందుతున్నాయి. దీంతో ఇటీవల కాలంలో ప్రభుత్వాస్పత్రుల్లో ఓపీ సంఖ్య రెట్టింపు నమోదవుతోంది. ప్రభుత్వ వైద్యంపై ప్రజలకు నమ్మకం కుదరడం, జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు ప్రజారోగ్యంపై చూపుతున్న శ్రద్ధకు ప్రశంసలు అందుతుండడాన్ని పచ్చపత్రిక ఓర్వలేకపోతోంది. ప్రజలకు మంచి జరుగుతున్న విషయం తెలిసినా తప్పుడు కథనాలను వండివార్చుతోంది. విషపురాతలతో బురద జల్లుతోంది.

ఏది లాభం?

ప్రభుత్వం అన్ని పీహెచ్‌సీల్లోనూ ప్రసవసేవలు అందిస్తోంది. ఆస్పత్రిలో ప్రసవానికి చేరినప్పటి నుంచి ప్రసవించే వరకు సకల సదుపాయాలు కల్పిస్తోంది. బాలింతలు, పిల్లలను తల్లీబిడ్డల ఎక్స్‌ప్రెస్‌లో పైసా ఖర్చులేకుండా సురక్షితంగా ఇంటికి చేర్చుతోంది. వీటితో ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న విషయాన్ని గ్రహించిన 'ఈనాడు'.. 'బేబీ కిట్టు బయట కొనాల్సిందేనంటూ' మభ్యపెట్టే యత్నం చేసింది. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వం ప్రసవం కోసం ఆస్పత్రుల్లో చేరే గర్భిణులకు ప్రసవం అనంతరం కేవలం రూ.1500లను, రూ.250లు విలువచేసే బేబీ కిట్లను మాత్రమే అందించేది. రూ.1500 కూడా రెండు, మూడు దఫాల్లో రెండు నెలల కాలవ్యవధిలో చెల్లించేది. ఇచ్చిన బేబీ కిట్లలో కూడా నాణ్యత లేకపోవడంతో ఎవరూ సరిగా ఉపయోగించే వారు కాదు. జగనన్న ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత నాణ్యత లేని బేబీ కిట్లు ఎవరూ ఉపయోగించడం లేదన్న విషయాన్ని తెలుసుకొని నేరుగా గర్భిణుల ఖాతాల్లో బేబీ కిట్లను కొనుక్కోవడానికి ఇవ్వాలిన మొత్తాన్ని కలిపి రూ.5వేలను ప్రసవం మరుచటి రోజే జమచేస్తోంది. ప్రసవ అనంతర ఖర్చులకు ఈ డబ్బులు ఉపయోగపడుతున్నాయంటూ బాలింతలు సంతోషం వ్యక్తంచేస్తున్నారు.

పార్వతీపురం మన్యం జిల్లా ఆస్పత్రిలో గత ఆరునెలల్లో ప్రసవాల సంఖ్య	
నెల	ప్రసవాల సంఖ్య
జనవరి	363
ఫిబ్రవరి	390
మార్చి	342
ఏప్రిల్	382
మే	349
జూన్	386

గతంలో కేవలం రూ.1500లు మాత్రమే ఇచ్చేవారు




మూడేళ్ల కిందట బేబీ కిట్లను ఆస్పత్రిలో అందజేసేవాళ్లం. అందులో నాణ్యత సరిగ్గా లేకపోవడంతో ఎవరూ సరిగ్గా వినియోగించుకునే వారు కాదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు చేరవేశాం. గతంలో కేవలం ప్రసవం అనంతరం రూ.1500లు మాత్రమే ఇచ్చేవారు. ఇప్పుడు బేబీ కిట్లు కొనుగోలు చేసేందుకు నగదుతో కలిపి ప్రసవం అనంతరం రూ.5వేలు నేరుగా గర్భిణి ఖాతాలో జమ చేస్తున్నాం.


– డా.బి.వాగ్దేవి, జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్, పార్వతీపురం

సాగుకు అండ

- ప్రాజెక్టుల ఆధునికీకరణ పనులకు ప్రభుత్వం ప్రాధాన్యం
- ప్రధాన కాలువలకు అనుసంధానంగా పిల్ల కాలువల తవ్వకం
- ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించే చర్యలు
- యుద్ధప్రాతిపదికన గండ్లు పూడ్చివేత
- జైకా నిధులతో పెద్దగెడ్డ, పెదంకలాం, ఆండ్ర, వీఆర్‌ఎస్‌ల ఆధునికీకరణ పనులు
- ఇప్పటికే తోటపల్లి నీరు విడుదల
- ప్రణాళికా బద్ధంగా చెరువులను నింపుతున్న అధికారులు



ఈ చిత్రం చూశారా.. తోటపల్లి కుడి ప్రధానకాలువ 110.325 కి.మీ వద్ద ప్రవహిస్తున్న సాగునీరు. గత ప్రభుత్వ హయాంలో జూన్ చివరి నాటికి ఈ స్థాయిలో నీరు వెళ్లేది కాదు. అసలు సాగునీటి కాలువల తవ్వకాలే జరగలేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తోటపల్లి ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యమిచ్చింది. సుమారు రూ.100 కోట్లను విడతల వారీగా కేటాయించింది. దీనివల్లే పనులు జరిగి సాగునీరు సరఫరా చేయగలుగుతున్నామన్నది అధికారుల మాట.



ఇది విజయనగరం బ్రాంచి కాలువ 5.7 కిలోమీటర్ వద్ద కుడి ప్రధాన కాలువలో సాగునీటి ప్రవాహం. ఖరీఫ్ సాగుకు ముందస్తుగా నీరు విడుదల చేయడం, కాలువలు బాగుచేయడంతో నీటిప్రవాహానికి అడ్డంకులు లేకపోవడంతో రైతులు సంతోషపడుతున్నారు. కాలువలో నీటి ప్రవాహాన్ని చూసి సాగునీటికి ఈ ఏడాది దోకాఉండదన్న అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

బొబ్బిలి:

రైతు బాగుంటేనే రాష్ట్రం, దేశం బాగుంటుందని జగన్‌మోహన్‌రెడ్డి సర్కారు బలంగా నమ్ముతోంది. నాలుగేళ్లుగా రైతులకు ఏ విధమైన కష్టం లేకుండా విత్తు నుంచి పంట కొనుగోలు వరకు సేవలందిస్తోంది. దీనికోసం ఆర్‌బీకేలను అందుబాటులోకి తెచ్చింది. ఏటా వైఎస్సార్ రైతు భరోసా కింద ముందస్తుగా పంట పెట్టుబడి సాయం అందిస్తోంది. జలయజ్ఞం కింద సాగునీటి ప్రాజెక్టులను ఆధునీకరిస్తోంది. గత టీడీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిన ప్రధాన కాలువలకు అనుసంధానంగా పిల్లకాలువలను తవ్విస్తోంది. ఏ ప్రభుత్వమూ చేయని విధంగా కాలువల లైనింగ్ పనులకు ప్రాధాన్యమిస్తోంది. చివారు భూములకు సైతం సమృద్ధిగా సాగునీరు అందించాలన్నదే లక్ష్యంగా సాగునీటి వనరుల అభివృద్ధి పనుల ప్రణాళికను అమలుచేస్తోంది. రైతన్నకు అండగా ఉంటూ సాగును పండగగా మార్చుతోంది. ఉమ్మడి విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల రైతులకు ప్రధాన ఆధారమైన సాగునీటి వనరులను అభివృద్ధి చేస్తూ, ఆయకట్టుకు సాగునీటిని అందిస్తూ రైతుల మన్ననలను అందుకుంటోంది. దీనిని చూసి ఓర్వలేని టీడీపీ అనుకూల మీడియా రైతుల్లో లేనిపోని అనుమానాలను లేవనెత్తుతోంది. పొలంపనుల్లో ఉత్సాహంగా ముందుకు 'సాగు'తున్న రైతన్నను నిరుత్సాహపరిచేలా తప్పుడు రాతలు రాస్తోంది. దీనిపై రైతులు భగ్గుమంటున్నారు. రైతులు మేలుకోరే ప్రభుత్వం ఏదో తమకు తెలుసని చెబుతున్నారు.

500 చెరువులకు ముందస్తుగా నీరు

జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టుల ద్వారా ప్రస్తుతం కేవలం నారుమడులకు మాత్రమే నీరుండాలి. ఉభాలు వచ్చేనాటికి కాలువల ద్వారా నీరు సాఫీగా సాగేందుకు, మరోవైపు నారుమడుల కోసం నీటిని వినియోగిస్తారనే ఆలోచనతో అధికారులు తోటపల్లి ప్రాజెక్టు నీటిని ముందస్తుగా విడుదల చేశారు. సాగునీటి అవసరాలు తీర్చేలా ముందస్తుగా 500 చెరువులను నింపుతున్నారు. ఇప్పటికే 140 చెరువులను నీటితో నింపారు.

గత ప్రభుత్వ హయాంలో తోటపల్లి ప్రాజెక్టు హెడ్ రెగ్యులేటర్ వద్ద ప్రధానకాలువ కట్టలు కుంగిపోయాయి. దీనికి కాంట్రాక్టర్ల వద్ద నుంచి లంచాలు బొక్కడంతో నాణ్యత లోపించిందనే విమర్శలు వెల్లువెత్తాయి. అప్పటికే దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి జలయజ్ఞం ప్రాధాన్యతాక్రమంలో రూ.1300 కోట్లు ఖర్చు చేస్తే కేవలం 400 కోట్లను విడతల వారీగా హెడ్‌రెగ్యులేటరీ పనులను పూర్తిచేసి శిలాఫలకం వేయించుకున్నారు. కనీసం అర కిలోమీటరు కాలువ కూడా తవ్వించలేదన్న విషయం రైతులకు తెలుసు. వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక తోటపల్లి మిగులు పనులకు రూ.92 కోట్లు కేటాయించి సుమారు 500 కిలోమీటర్ల పిల్ల కాలువలు తవ్వించారు. మరో 140 కిలోమీటర్లు తవ్వించాలి. దీనికి సంబంధించిన పనులు జరుగుతున్నాయని ఈఈ రామమంద్రరావు తెలిపారు. ● జంఝావతి సాగునీరు విడుదల చేసేందుకు నెల పడుతుందని అధికారులు చెబుతున్నారు. అందుకు తగ్గ ఏర్పాట్లను సిద్ధం చేస్తున్నారు. ● జిల్లాలోని మధ్య తరహా ప్రాజెక్టులైన వట్టిగెడ్డ, పెదంకలాం, వెంగళరాయసాగర్, పెద్దగెడ్డ సాగునీటి ప్రాజెక్టుల పరిధిలో 71,063 ఎకరాలకు సాగునీరు అందించాల్సి ఉంది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం వలన ఇందులో దాదాపు 40 శాతం భూములకు సాగునీరు అందడం లేదు. లైనింగ్ బాగాలేక, ప్రాజెక్టుల్లో మరమ్మతు పనులు చేపట్టక నిలిచిపోయాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంజైకా నిధులు రూ.165 కోట్లతో పనులకు పరిపాలనామోదం తెలిపింది. ఆయకట్టుకు నీరందించేలా పనులు చేయిస్తోంది.



ఈ చిత్రం చూశారా? తోటపల్లి కుడి ప్రధాన కాలువకు ఎలుకలు, పందికొక్కుల పెట్టిన రంధ్రాలతో బొబ్బిలి మండలం అలజంగి వద్ద ఒకే చోట మూడు గండ్లు పడ్డాయి. సాగునీరు వృథాగా పోతుందంటూ రైతులు ఇచ్చిన సమాచారంతో జలవనరుల శాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఈఈ రామచంద్రరావు, డీఈఈ రఘునాథరావు తమ సిబ్బందితో కేవలం రెండు రోజుల్లోనే గండినిపూడ్చి నీటివృథాను అరికట్టారు. తరువాత రెండు రోజుల పాటు గట్టును పటిష్టపరిచారు.



వీఆర్‌ఎస్ ప్రాజెక్టు వద్ద లైనింగ్ పనులు

తోటపల్లి పనుల కోసం కేటాయించిన బడ్జెట్ (రూ.కోట్లలో)	
2019	రూ.32.45 కోట్లు
2020	రూ.225.57 కోట్లు
2022	రూ.126.61 కోట్లు
2024	రూ.80.84 కోట్లు

జోరుగా ఆధునికీకరణ పనులు



తోటపల్లి ఆధునికీకరణ పనులు నాణ్యతతో చేశాం. జంఝావతి నుంచి పూర్తిస్థాయిలో సాగునీరు విడుదలకు మరో నెలరోజుల సమయం పడుతుంది. పెద్దగెడ, వీఆర్‌ఎస్, పెదంకలాం, ఆండ్ర తదితర ప్రాజెక్టులకు లైనింగ్ పనులు చేశాం. కొత్తగా కాలువలు తవ్వకం, ఎండలకు కాలువ గట్లు బీటలు వారడం వల్ల పడిన గండ్లను వెంటనే పూడ్చుతున్నాం. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు అందించేదిశగా సాగుతున్నాం.

– ఎస్.సుగుణాకరరావు, చీఫ్ ఇంజినీర్, జలవనరుల శాఖ

క్లుప్తంగా

ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలి

పార్వతీపురం: అర్హత కలిగిన ఫుట్‌బాల్ రిఫరీలు, కోచ్‌లు, క్రీడాకారులు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్‌లో రిజిస్ట్రేషన్‌చేయించుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వేణురెడ్డి రవితేజ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ఫుట్‌బాల్ అసోసియేషన్ సూచనల మేరకు రిజిస్ట్రేషన్ చేయిస్తున్నట్లు పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న వారు రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9676211109 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో పతకాలు



విజేతలుగా నిలిచిన తైక్వాండో విద్యార్థులు

పార్వతీపురంటౌన్: జూలై 1,2 తేదీల్లో తిరుపతిలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ విభాగం బాలుర కేటగిరీలో అనిల్‌శర్మ తైక్వాండో అకాడమీ విద్యార్థులు గోల్డ్ మెడల్ 1, సిల్వర్‌మెడల్ 1, బ్రాంజ్‌మెడల్ 1 సాధించినట్లు కోచ్ అనిల్ కుమార్ శర్మ సోమవారం తెలిపారు. అలాగే బాలికల విభాగంలో బ్రాంచ్ మెడల్ 1, కూంషేలో మూడు బ్రాంచ్ మెడల్స్ సాధించినట్లు తెలిపారు. ఈనెల 7,8,9 తేదీల్లో కర్ణాటకలోని శివమొగ్గలో నిర్వహించే పోటీల్లో వీరంతా పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనబరచడం పట్ల కోచ్‌తోపాటు పలువురు విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

భార్యా పిల్లల అదృశ్యంపై కేసు నమోదు

రాజాం సిటీ: స్థానిక బాబానగర్‌లో నివాసం ఉంటున్న సంతకవిటి మండలం బొద్దూరు గ్రామానికి చెందిన శాసపు రాంబాబు తన భార్య, ఇద్దరు పిల్లలు అదృశ్యమయ్యారని ఇచ్చిన ఫిర్యాదుమేరకు కేసు నమోదుచేశామని ఎస్సై పి.నీలావతి సోమవారం తెలి పారు. ఈ నెల 1న తన ఇద్దరు పిల్లల్లో ఒకరిని కళాశాలకు, మరొకరిని పాఠశాలకు తీసుకువెళ్లేందుకు భార్య అరుణకుమారి వెళ్లింది. అప్పటి నుంచి ముగ్గురు ఇంతవరకు ఇంటికి రాలేకపోవడంతో అన్నిచోట్ల వెతికినా ప్రయోజనం లేకపోయిందని ఫిర్యాదులో బాధితుడు పేర్కొన్నాడన్నారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

తండ్రీకొడుకులకు తీవ్రగాయాలు

జామి: అలమండ సంతకు బైక్‌పై వెళ్లి తిరిగి వస్తుండగా వెనుక నుంచి బొలెరో వాహనం ఢీకొట్టడంతో కొట్యాడ గ్రామానికి చెందిన కొట్యాడ బంగారయ్య, కుమారుడు అప్పల ఈశ్వరరావు తీవ్ర గాయాల పాలయ్యారు. గొడికొమ్ము పెద్ద చెరువు వద్ద బైక్‌ను బొలెరో ఢీకొట్టడంతో బోల్తా పడడంతో ప్రమాదం జరిగింది. దీంతో క్షతగాత్రులను 108 వాహనంలో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అర్జీదారులకు పరిష్కార చర్యలు వివరించాలి

● అధికారులకు కలెక్టర్ నాగలక్ష్మి ఆదేశాలు



అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి ఎస్

విజయనగరం అర్బన్: వివిధ సమస్యలపై ప్రజలు ఇచ్చిన వినతులకు ఆయా ప్రభుత్వ శాఖల ద్వారా సంతృప్తికర పరిష్కారానికి చేపట్టిన చర్యలపై ఆయా శాఖల అధికారులు, సిబ్బంది స్వయంగా అర్జీదారులను కలిసి వివరించడం ద్వారా వారిని సంతృప్తి పరచవచ్చని కలెక్టర్ నాగలక్ష్మి ఎస్ పేర్కొన్నారు. దీనివల్ల సంబంధిత సమస్యలను వెంటనే పరిష్కరించలేనప్పటికీ కొంత వ్యవధిలో సమస్య పరిష్కారం అవుతుందన్న నమ్మకం అర్జీదారుల్లో ఏర్పడి అర్జీల పరిష్కారంపై సంతృప్తి వ్యక్తం చేసే అవకాశం ఉంటుందన్నారు. జగనన్నకు చెబుదాం ప్రజా వినతుల పరిష్కారం కార్యక్రమంలో భాగంగా గత వారంలో అర్జీదారుల నుంచి అసంతృప్తి వ్యక్తమైన వినతులపై కలెక్టర్ నాగలక్ష్మి, జేసీ మయూర్ అశోక్ సోమవారం కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో అధికారులతో సమీక్షించారు. జగనన్నకు చెబుదాంలో వచ్చే వినతులపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేయకుండా, తగిన చర్యలు పూర్తికాకుండా మూసివేయవద్దని స్పష్టం చేశారు.

217 అర్జీల అందజేత

కలెక్టరేట్‌లోని ఆడిటోరియంలో నిర్వహించిన వినతుల స్వీకరణ కార్యక్రమంలో వివిధ వర్గాల ప్రజలు 217 వినతులు అందజేశారు. ఎప్పటిలాగే రెవెన్యూ సమస్యలపై అత్యధికంగా 142 వినతులు అందాయి. పంచాయతీ రాజ్ శాఖకు సంబంధించి 15, హౌసింగ్ 11, గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 25, మున్సిపల్ శాఖ 9, వైద్యారోగ్య శాఖ 5, జిల్లా ఆస్పత్రులపై 3, డీఆర్‌డీఏకు సంబంధించి 7 వినతులు అందాయి. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు, ఎస్‌డీసీలు సూర్యనారాయణ, పద్మలత తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణమే చర్యలు



బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

విజయనగరం క్రైమ్: బాధితుల ఫిర్యాదులపై తక్షణమే చర్యలు చేపట్టాలని పోలీస్ అధికారులను ఎస్పీ ఎం.దీపిక కోరారు. ఈ మేరకు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో ఆమె పాల్గొని, బాధితుల నుంచి 45 ఫిర్యాదులను స్వీకరించారు. బాధితులిచ్చిన ఫిర్యాదులను పరిశీలించి, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు జి.రాంబాబు, ఈ.నరసింహమూర్తి, డీసీఆర్‌బీ ఎస్సైలు వాసుదేవ్, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ల కోసం ప్రయాస పడొద్దు

● కలెక్టర్ నిషాంత్‌కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలను అందించాలని, తద్వారా ప్రజలు సంవత్సరం వరకు కార్యాలయాల చుట్టూ సర్టిఫికెట్ల కోసం తిరిగే అవసరం ఉండదని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావుతో కలిసి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమం అనంతరం అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జగనన్న సురక్ష కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించే గ్రామాలలో అందజేయవలసిన సర్టిఫికెట్స్ ముందు రోజే సిద్ధం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉదయం పూట సర్టిఫికెట్స్ పంపిణీ పూర్తయితే, గ్రామంలో సమస్యలను తెలుసుకుని, గ్రామస్తులతో మాట్లాడేందుకు సమయం ఉంటుందని తెలిపారు. ముందుగా ఇచ్చిన షెడ్యూల్ ప్రకారం జగనన్న సురక్ష క్యాంపులను ఏర్పాటు చేయాలని, షెడ్యూల్‌లో ఎటువంటి మార్పులు చేయకూడదని స్పష్టం చేశారు, ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు కార్యక్రమం నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ చూపాలని కోరారు.

117 అర్జీల స్వీకరణ

జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు సామాజిక, వ్యక్తిగత సమస్యల పరిష్కారం కోరుతూ 117 అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా అటవీ అధికారి జీఏపీ ప్రసూన, డీఆర్‌డీఏ పీడీ పి.కిరణ్ కుమార్, డీఎంహెచ్‌ఓ బి. జగన్నాథరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకర రావు, డీపీఓ బి.సత్యనారాయణ, జిల్లా సివిల్ సప్లయిస్ అధికారి సూర్యారావు, జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజి, డీఈఓ ఎస్.ప్రేమ్ కుమార్ ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

నిర్దిష్ట గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

● అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్



వినతులు స్వీకరిస్తున్న అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్

పార్వతీపురంటౌన్: స్పందన వినతులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా అదనపు ఎస్పీ దిలీప్ కిరణ్ అన్నారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలపై స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీ సీఐ ఎన్. శ్రీనివాస రావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎన్‌వీ ప్రభాకర్, పార్వతీపురం పట్టణ సీఐ కృష్ణారావు, ఏఆర్ ఆర్ఐ శ్రీరాములు, డీసీఆర్‌బీ ఎస్సై దినకర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఏసీబీ వలలో సర్వేయర్

● రూ.10వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు



ఏసీబీకి చిక్కిన సర్వేయర్ చంద్రరావు

రాజాం సిటీ: కాసులకు కక్కుర్తిపడిన ఓ మండల సర్వేయర్ రూ.పది వేలు లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు సోమవారం పట్టుబడ్డాడు. వివరాలిలా ఉన్నాయి.... మున్సిపాల్టీ పరిధి కొండంపేట గ్రామానికి చెందిన సలాది రామదాస్ తన కున్న ఖాళీ స్థలాన్ని సర్వేచేయాలని ఈ ఏడాది మే 3వ తేదీన దరఖాస్తు చేసుకున్నాడు. అప్పటి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ ప్రయోజనం లేకపోయింది. ఇటీవల బదిలీపై వచ్చి విధుల్లో చేరిన సర్వేయర్ వి.చంద్రరావు వద్ద తన గోడు వెళ్లబోసుకున్నాడు. దీంతో సర్వేయర్ రూ.50వేలు డిమాండ్ చేసి రూ.30వేలకు అంగీకరించాడు. అందులో భాగంగా ముందుగా రూ.10వేలు అందజేయాలని సర్వేయర్ డిమాండ్ చేశాడు. దీంతో విసుగుచెందిన బాధితుడు రామదాస్ ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచనల మేరకు సర్వేయర్‌కు రామదాస్ రూ.10 వేలు ఇస్తుండగా అధికారులు పట్టుకున్నారు.

చెల్లిపై అన్నదమ్ముల దాడి



చికిత్స పొందుతున్న రామలక్ష్మి

పార్వతీపురం: పట్టణంలోని కొత్తవలసకు చెందిన పి.రామలక్ష్మిపై ఇంటి విషయమై ఆమె అన్నయ్యలు పి.లక్ష్మణ, ఆదినారాయణ, రామారావులు దాడిచేశారు. వివరాలిలా ఉన్నాయి. రామలక్ష్మి ఎన్నో ఏళ్లుగా అమ్మ, నాన్నలకు సేవ చేసింది. తల్లిదండ్రులిద్దరూ చనిపోవడంతో ఆ ఇంటిని ఖాళీచేయాలని అన్నదమ్ములు చెల్లిపై చాలా సార్లు ఒత్తిడిచేశారు. ఇందులో భాగంగా ఆదివారం రాత్రి అన్నదమ్ములు వచ్చి ఇంటిని ఖాళీచేస్తావా లేదా అంటూ దాడిచేయడంతో రామలక్ష్మికి పలు చోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు చికిత్సకోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

విద్యార్థినుల విలవిల

● హాస్టల్ వార్డెన్ నుంచి రక్షణ కల్పించాలని వేడుకోలు



నెక్కల నాయుడుబాబుకు సమస్యలను వివరిస్తున్న విద్యార్థినులు

కొత్తవలస: హాస్టల్ వార్డెన్ వేధింపులకు గురి చేస్తున్నారు, అసభ్యకరంగా అనరాని మాటలాడుతున్నారు. హాస్టల్‌లో అన్ని రకాల పనులు మాతో చేయిస్తున్నారు. ఆ వేధింపులు తట్టుకోలేకపోతున్నామని రాష్ట్ర కొప్పులవెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు,ఎంఈఓ జి.శ్రీదేవిల ముందు విద్యార్థినులు విలపించారు. తమకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు. వివరాలిలా ఉన్నాయి. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న అమ్మఒడి కార్యక్రమానికి సోమవారం హాజరైన నాయుడుబాబు వద్దకు స్థానిక బీసీ వెల్ఫేర్ బాలికల వసతిగృహంలో చదువుతున్న విద్యార్థినులు తల్లిదండ్రులతో కలిసి వచ్చి హాస్టల్‌లో జరుగుతున్న పరిణామాలను వివరించారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ హాస్టల్‌లో తోటపని, హౌస్‌కీపింగ్, వంటసామగ్రి క్లీనింగ్, కాయగూరలు తరగడం వంటి పనులను చేయిస్తున్నారని అంతే కాకుండా అనరాని పదజాలంలో దూషిస్తూ వేదింపులకు గురు చేస్తున్నారని రోదిస్తూ చెప్పారు. దీంతో కలత చెందిన నాయుడుబాబు వెంటనే వార్డెన్ నీరజాకుమారికి ఫోన్ చేసి మీ పద్ధతి మార్చుకోవాలని పిల్లలను హింసించడం తగదని మండిపడ్డారు. అసలు పిల్లలతో పనులు చేయించడం, తిట్టడం ఏమిటని ప్రశ్నించారు. దీనికి వార్డెన్ బదులిస్తూ తప్పులు జరిగి ఉంటే సరిదిద్దుకుంటానని, ఒక్క అవకాశం ఇవ్వండని ప్రాధేయపడ్డారు. కాగా వార్డెన్ నీరజకుమారిపై శాఖాపరమైన చర్యలకు సిఫార్స్ చేయాలని ఎంఈఓ శ్రీదేవికి నాయుడుబాబు సూచించారు.

205 లీటర్ల సారా స్వాధీనం



పట్టుబడిన సారా కేన్లతో ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర, తదితరులు

పార్వతీపురం: సారా శిబిరాలపై దాడులను నిర్వహించి 205 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకుని మరో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర సోమవారం తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అడిషనల్ ఎస్పీ దిలీప్ కిరణ్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ ఎల్. ఉపేంద్ర ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. పార్వతీపురం పట్టణం పరిధిలోని పెదరెల్లి వీధికి చెందిన సొండి సురేష్ అలియాస్ జానీని అదుపులోకి తీసుకుని 120 లీటర్ల సారాతోపాటు ఒక ద్విచక్రవాహనాన్ని సీజ్ చేశారు. అలాగే కొమరాడలో సారా విక్రయిస్తున్న దాసరి గౌరి వద్ద 85 లీటర్ల సారా స్వాధీనంచేసుకుని మరో వ్యక్తిపై కేసును నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర తెలిపారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుళ్లు శ్రీనివాస్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లు సీజ్

బొబ్బిలి: మండలంలోని నారాయణప్పవలసలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న 5 ట్రాక్టర్లను తహసీల్దార్ డోల రాజేశ్వర రావు సోమవారం సీజ్ చేశారు. వాటిని బొబ్బిలి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కొన్ని రోజులుగా నారాయణప్పవలస పెద్ద చెరువు నుంచి ట్రాక్టర్లతో మట్టి, గ్రావెల్‌ను ఎటువంటి అనుమతులు లేకుండా తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు తహసీల్దార్ నేరుగా తవ్వకాల వద్దకు వెళ్లి ట్రాక్టర్లను పట్టుకున్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 515.00
విజయనగరం	రూ. 519.00
శ్రీకాకుళం	రూ. 519.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	58,960–00
బంగారం(22సి. 10గ్రా.)	54,050–00
వెండి (కిలో)	75,500–00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్‌డ్	స్కిన్‌లెస్
₹130	₹230	₹ 240

ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి

LiFE Lifestyle for Environment

ప్రాంతీయ కార్యాలయం, డోర్ నెం.8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా - 535 002

ప్రజాభిప్రాయ సేకరణ

భారత ప్రభుత్వ పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వశాఖ పర్యావరణ చట్టం 1986 క్రింద విడుదల చేసిన ఇ.ఐ.ఎ. నోటిఫికేషన్ ఎస్.ఓ.నెం.1533, తే.14-09-2006 ది మరియు తదుపరి సర్క్యులర్స్ ప్రకారం మెస్సర్స్ బాలాజీ మెటాలిక్స్, (కలర్ గ్రానైట్) (14.0 హెక్టార్లు) వారు రూ. 2.209 కోట్లుతో సాలీన కలర్ గ్రానైట్ - 9,328.80 క్యూబిక్ మీటర్ల త్రవ్వటకు ప్రతిపాదించిన ప్రాజెక్టును 14.0 హెక్టార్లలో సర్వే నెం. 79, పెదరావ్వం (గ్రామం), చెల్లాపురం (పంచాయతీ), మెరకముడిదాం మండలం, విజయనగరం జిల్లాలో ప్రజాభిప్రాయ సేకరణ సదస్సు నిర్వహించుట గురించి ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం జిల్లా వారు జారీచేయు ప్రకటన.

ప్రాజెక్టు వివరములు క్రింది విధంగా ఉన్నవి :

1.	సంస్థ పేరు మరియు చిరునామా	మెస్సర్స్ బాలాజీ మెటాలిక్స్, (కలర్ గ్రానైట్) (14.0 హెక్టార్లు) సర్వే నెం. 79, పెదరావ్వం (గ్రామం) చెల్లాపురం (పంచాయతీ), మెరకముడిదాం మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
2.	ప్రాజెక్టు స్థలం	సర్వే నెం. 79, పెదరావ్వం (గ్రామం) చెల్లాపురం (పంచాయతీ), మెరకముడిదాం మండలం, విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్.
3.	అధీకృత వ్యక్తి పేరు, చిరునామా మరియు చరవాణి సంఖ్య	శ్రీ జ్ఞాన్ మూర్తి షా, పార్టనర్, 5/268, సర్దార్ బజార్ చిబస, వెస్ట్ సింగుం, ఝార్ఖండ్. ఫోన్ నెం. 9603447792, 9000150077 E-mail: sgsminestekilli@yahoo.com
4.	ప్రాజెక్టు విలువ	రూ. 2.209 కోట్లు
5.	ఉత్పత్తి వివరములు	కలర్ గ్రానైట్ - 9,328.80 క్యూబిక్ మీటర్లు
6.	తేదీ, సమయం మరియు జరుగుస్థలం	**తేది: 04-08-2023 (శుక్రవారం), సమయం - ఉదయం 10.30 గం॥లకు. స్థలం: పెదరావ్వం గ్రామం దగ్గర.**

7. ప్రాజెక్టు కార్యనిర్వాహక సమాచారం, ప్రాజెక్టు పర్యావరణ ప్రభావ అంచనా మరియు కార్యాచరణ ప్రణాళిక నివేదిక మరియు (సాఫ్ట్ కాపీలు) ప్రజలు చూచుటకు అందుబాటులో ఉంచబడిన ప్రదేశములు: 1) జిల్లా కలెక్టరు వారి కార్యాలయం, విజయనగరం. 2) జిల్లా రెవెన్యూ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 3) జిల్లా రెవెన్యూ డివిజనల్ అధికారి వారి కార్యాలయం, విజయనగరం. 4) ముఖ్య కార్యనిర్వాహణాధికారి వారి కార్యాలయం, జిల్లా పరిషత్, విజయనగరం. 5) జిల్లా పరిశ్రమల శాఖ, ఇండస్ట్రియల్ ఎస్టేట్, విజయనగరం. 6) సభ్యకార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, పర్యావరణ భవన్, ఏపీఐఐసీ కాలనీ రోడ్, గురునానక్ కాలనీ, ఆటో నగర్, విజయవాడ- 520007. 7) జోనల్ కార్యాలయం, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ఉడా లేఅవుట్, మాధవధార, విశాఖపట్నం. 8) డిప్యూటి డైరెక్టర్ (యస్), పర్యావరణ మరియు అటవీ మంత్రిత్వ శాఖ కార్యాలయం మరియు క్లైమేట్ ఛేంజ్, భారత ప్రభుత్వం, సమీకృత ప్రాంతీయ కార్యాలయం, గ్రీన్ హౌస్ కాంప్లెక్స్, గోపాలరెడ్డి రోడ్, విజయవాడ-520010, ఆంధ్రప్రదేశ్. 9) స్టేట్ లెవల్ ఎన్విరానమెంట్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ అథారిటీ (ఎస్.ఇ.ఐ.ఎ.ఎ.) వారి కార్యాలయం, డోర్ నెం. 33-26-14డి/2, సన్‌రైజ్ హాస్పిటల్ దరి, పుష్ప హోటల్ సెంటర్, చలమవారివీధి, కస్తూరిభాయి పేట, విజయవాడ -520010. 10) జిల్లా గనులు మరియు భూగర్భశాఖ ఆఫీసర్ వారి కార్యాలయం, విజయనగరం. 11) తహశీల్దార్ కార్యాలయం, మెరకముడిదాం మండలం, విజయనగరం. 12) గ్రామ పంచాయితీ కార్యాలయం, పెదరావ్వం (గ్రామం), చెల్లాపురం (పంచాయతీ), మెరకముడిదాం మండలం, విజయనగరం. 13) ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి, ప్రాంతీయ కార్యాలయం, డోర్‌నెం. 8-30-19, సాయినగర్, తోటపాలెం, విజయనగరం జిల్లా.

పై తెలియజేసిన ప్రాజెక్టుకు సంబంధించి ఏమైనా సూచనలు, సలహాలు, అభిప్రాయాలు మరియు అభ్యంతరములు ఉన్న యెడల **తే: 04.08.2023** దిన గాని, దానికి ముందుగా గాని ఈ క్రింది సంతకము చేసిన అధికారి వారికి లిఖిత పూర్వకముగా పంపించవచ్చును. మరియు పైన సూచించిన తేది మరియు ప్రదేశము వద్ద ప్రజాభిప్రాయ సేకరణ సదస్సులో పాల్గొని గానీ తెలియజేయవచ్చు.

స్థలం : విజయనగరం.
తేది : 04-07-2023


సం/- (పర్యావరణ ఇంజనీర్)
ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి,
ప్రాంతీయ కార్యాలయం, విజయనగరం.

తల్లి ఆత్మహత్య

● కుమార్తె ఆత్మహత్యాయత్నం

నెల్లిమర్ల రూరల్: నగర పంచాయతీ పరిధిలోని గాంధీనగర్ కాలనీకి చెందిన మహిళ వ్యక్తిగత కారణాలతో సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. దీంతో విషయం తెలుసుకున్న మృతురాలి కుమార్తె ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. గాంధీనగర్ కాలనీకి యువతి బొట్టా సాయిలీల ప్రైవేట్ సంస్థలో ఉద్యోగిగా పనిచేస్తోంది. తాను ఓ వ్యక్తిని ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని ఇటీవల ఆమె ఇంట్లో చెప్పింది. తల్లి సత్యవతి(45)కి ఈ విషయం నచ్చకపోవడంతో ఇద్దరి మధ్య వివాదం జరిగింది. దీంతో తల్లి సత్యవతి సమీపంలోని రైల్వే ట్రాక్ వద్దకు వెళ్లి రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కుటుంబసభ్యులు రైల్వేట్రాక్‌పై ఉన్న మృతదేహాన్ని ఇంటికి తీసుకువెళ్లి గుట్టు చప్పుడు కాకుండా అంత్యక్రియలు నిర్వహించారు. కాగా తల్లి ఆత్మహత్య చేసుకుందని విషయం తెలుసుకున్న కుమార్తె మనస్తాపం చెంది ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యా యత్నానికి పాల్పడింది. గమనించిన స్థానికులు అపస్మారక స్థితిలో ఉన్న సాయిలీలను చికిత్స నిమిత్తం స్థానిక మిమ్స్ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉరివేసుకుని వ్యక్తి ..



పిట్టా రాము (ఫైల్)

భోగాపురం: మండలంలోని సవరవల్లి గ్రామానికి చెందిన పిట్టా రాము(42) అప్పుల బాధ తాళలేక సోమవారం సాయంత్రం జీడిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. వివరాలిలా ఉన్నాయి. పిట్టా రాముకు భార్య ఎర్రయ్యమ్మతో పాటు ఇద్దరు కుమార్తెలు కొండమ్మ, గౌరమ్మ ఉన్నారు. కొంతకాలం కిందట పెద్ద కుమార్తె కొండమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో రాము సంవత్సరం కిందట అప్పుచేసి రెండవ కుమార్తె గౌరమ్మకు పెళ్లి చేశాడు. ఆ సమయంలో చేసిన అప్పు వడ్డీతో కలిసి సుమారు రూ.5లక్షలు వరకు చేరుకుంది. అప్పులు ఎక్కువ అయిపోయాయని బెంగతో మనస్తాపానికి గురైన రాము గ్రామానికి సమీపంలో జీడిచెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని సుందరపేట సీహెచ్‌సీకి తరలించారు. మృతుని భార్య ఎర్రయ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

పిడుగు పడి వ్యక్తి మృతి

పాలకొండ; మండలంలోని రాజుపేట గ్రామంలో సోమవారం సాయంత్రం పిడుగు పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. గ్రామస్తులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన శనపతి కోటేశ్వరరావు పొలంలోకి ఆవులను మేతకు తీసుకువెళ్లాడు. సాయంత్రం ఐదు గంటల సమయంలో మేఘాలు కమ్మి మెరుపులతో పాటు పిడుగు కోటేశ్వరరావుకు సమీపంలో పడడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దూరంలో ఉన్న రైతులు గమనించి మృతుడి కుటుంబసభ్యులు, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించారు.

టాటా మ్యాజిక్ మినీ వ్యాన్ ఢీకొని మరొకరు..

దత్తిరాజేరు: మండలంలోని ఎస్.బూర్జవలస పోలీస్‌స్టేషన్ సమీపంలో జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారు జామున టాటామ్యాజిక్, ఐషర్ వ్యాన్ ఢీకొనడంతో జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందగా ముగ్గురికి గాయాలైనట్లు ఇన్‌చార్జ్ ఎస్సై శిరీష తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. రామభద్రపురం నుంచి గజపతినగరం వెళ్తున్న ఐషర్ వ్యాన్ గాజువాక నుంచి రామభద్రపురం వస్తున్న టాటా మ్యాజిక్ ఎదురు ఎదురుగా ఢీకొన్నాయి, దీంతో జరిగిన ప్రమాదంలో గాయపడిన నలుగురిని వెంటనే 108లో విజయనగరం మహారాజా ఆస్పత్రికి తరలించగా అనకాపల్లి మండలం దేవారం గ్రామానికి చెందిన ఐషర్ వ్యాన్ డ్రైవర్ పి.వెంకటేష్ (32)మృతిచెందాడు. టాటా మ్యాజిక్ డ్రైవర్ వై.సన్నిబాబుతో పాటు మంగలక్ష్మి, రమణమ్మలకు తీవ్ర గాయాలు కావడంతో వైజాగ్ కేజీహెచ్‌కు తరలించారు. మృతుడికి భార్య, ఆరు నెలలు కుమారుడు ఉన్నారు. ఈ ప్రమాదపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై తెలిపారు.

బైక్ నుంచి జారిపడి వ్యక్తి..

జామి: మండలకేంద్రం జామికి చెందిన వాక స్వామినాయుడు (35) ఆదివారం రాత్రి భీమసింగి నుంచి జామి వస్తుండగా స్థానిక పెట్రోల్ బంకు సమీపంలో అదుపు తప్పడంతో బైక్‌పై నుంచి పడి తీవ్ర గాయాల పాలయ్యాడు. దీంతో విజయనగరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం విశాఖ కేజీహెచ్‌కు తీసుకువెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. ఈఘటనపై కేసు నమోదుచేసినట్లు ఎస్సై వీరబాబు తెలిపారు. మృతుడు స్వామినాయుడికి భార్య కోటమ్మ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

రూ10లక్షల విలువైన గంజాయి స్వాధీనం



పట్టుబడిన గంజాయి ప్యాకెట్లను పరిశీలిస్తున్న ఎస్సై కృష్ణమూర్తి, సిబ్బంది

భోగాపురం: ఇన్నోవా కారులో అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ.10 లక్షలు విలువ చేసే గంజాయిని మండల కేంద్రం లోని జాతీయ రహదారిపై పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి ఎస్సై కృష్ణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం సాయంత్రం ఎస్సై కృష్ణమూర్తి, ఏఎస్సై టీఎస్‌ఎన్ రాజులు ఇతర సిబ్బందితో కలిసి భోగాపురం జాతీయ రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ క్రమంలో ఇన్నోవా కారులో గుర్తు తెలియని వ్యక్తులు శ్రీకాకుళం నుంచి విశాఖపట్నం వెళ్తున్నారు. పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండడం చూసి కారును పక్కకు తీసి అక్కడి నుంచి పరారయ్యారు. దీంతో పోలీసులకు అనుమానం వచ్చి వాహనాన్ని తనిఖీ చేయగా కారులో రూ.10 లక్షలు విలువ చేసే సుమారు 134కేజీల గంజాయి పట్టుబడింది. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై తెలిపారు.